Vol. XI

No. 2

6th September, 1982.
(Monday)
15 Bhadra, 1904 S. E.

# THE ANDHRA PRADESH
# Legislative Assembly Debates
## OFFICIAL REPORT

### CONTENTS

| | Pages |
|---|---|
| Condolence Motion: | |
| re: Demise of Sri Shivlal, Member of Andhra Pradesh Legislative Assembly. .. | 89 |
| Announcement: | |
| re: Report included in the agenda to be presented deemed to have been presented. | 103 |

BY THE DIRECTOR OF PRINTING GOVERNMENT OF ANDHRA PR
AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD.
1998

THE

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

## PRINCIPAL OFFICERS

Speaker : .. — ...

Deputy Speaker .. Sri A. Eswara Reddy.

Panel of Chairmen: .. 1. Smt D. Indira.

2. Sri D. K. Samara Simha Reddy.

3. Sri B. Niranjana Rao.

4. Sri V. Sobhanadrewara Rao.

5. Sri K. Govinda Rao.

6. Sri C. V. Reddy.

Secretary: Sri E. Sadasiva Reddy.

Joint Secretary: Sri D. L. Narasimham.

Deputy Secretary: Sri M. Ramanadha Sastry.

Assistant Secretaries: 1. Sri S. Purnananda Sastry.

2. Sri M. Viswanatham.

3. Sri J. V. Ramana Murthy.

4. Sri P. Bashaiah.

5. Sri A. V. G. Krishna Murthy.

6. Sri M. V. Hanumantha Rao.

7. Sri N. Pattabhirama Rao.

8. Sri Habeeb Abdur Rahman.

Chief Reporter — Smt. M. V. S. Jayalakhmi.

THE

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

## OFFICIAL REPORT

---

Thirty ninth Day of the Twelfth Session of the Andhra Pradesh Legislative Assembly.

---

## ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

Monday the 6th September, 1982

The House met at Half-past Eight of the Clock

(Mr. Deputy Speaker in the Chair)

### Condolence Motion

8-30 a. m.

Mr. Deputy Speaker:—The leader of the House will move the Condolence Motion on the demise of Sri Shiv Lal.

Sri A. Madan Mohan:—I beg to move:—

This House places on record its deep sense of sorrow at the demise of Sri Shiv Lal member of Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to the members of bereaved family.

Mr. Deputy Speaker:-Motion moved

శ్రీ ఎ. మదన మోహన్:—అధ్యక్షా, శ్రీ శివలాల్ నిన్నటి వరకు మనతో ఉండి మనలో ఉండి ప్రజా జీవితంలో పని చేస్తున్న సంగతి మనకందరికీ తెలుసు. ఆయన మరణం అందరిని విచారంలో ముంచివేసింది. ఆయన సామాన్య కార్యకర్తగా సంవత్సరాల తరబడి పని చేస్తూ క్రమ శిక్షణ కలిగిన సిపాయి మాదిరి వ్యవహరించిన వారు. పార్టీ వ్యవహారాల్లో క్రమ శిక్షణను పాటించే వారు. సామాన్య కార్యకర్తగా పని చేసి శాసన సభ్యునిగా ఉండే అర్హతను సంపాదించారు. పట్టణంలో వారి నియోజక వర్గానికి మా పార్టీ అభ్యర్థిగా గోవింద సింగ్ గారికి టికెటు ఇవ్వాలని నిశ్చయించినప్పుడు గోవింద్ సింగ్ గారే లేదు, శివలాల్ అక్కడ అభ్యర్థిగా ఉంటారని ఆయన తనంతట తానే వాలంటరీగా తప్పుకుని శివలాల్ గారికి టికెట్టు వచ్చేట్లు చేయడం నాకు బాగా గుర్తు ఉంది. శాసన సభలో కాని బైట కాని ప్రజా జీవితంలో ఒక కార్యకర్తగా ప్రజల సమస్యల పట్ల కుతూహలతతో వ్యవహరించిన పేరు ఆయనకు ఉంది. ఎప్పుడైనా ఏదైనా తొందరపాటుతో ఏదైనా మాట్లాడినప్పటికీ వెంటనే తానే సవరించుకునే వారు. సహృదయతతో ఆవేశానికి చోటు ఇవ్వకుండా తోటి శాసన సభ్యులతో

కలిసిమెలిసి తిరిగేవారు. నిన్న కూడా ప్రజలకు సంబంధించిన ఒక కార్యక్రమానికి వెళ్ళి హఠాత్తుగా ప్రాణాలు కోల్పోయారంటే ఎంతో బాధాకరమైన విషయం. చిన్న వయస్సులోనే ఇంత తొందరగా మృత్యువు వారిని వరిస్తుందని ఎవరమూ ఊహించలేకపోయాం. వారు చూపించిన క్రమ శిక్షణ, ప్రజా హిత కార్యక్రమాల పట్ల ఆసక్తి మనందరికీ మార్గదర్శకంగా ఉంటుంది. యువతరం వారు ఆదర్శప్రాయంగా పెట్టుకోవలసిన వ్యక్తి. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఈ తీర్మానాన్ని సభ వారి ఏకగ్రీవ ఆమోదానికి ప్రతిపాదిస్తున్నాను.

శ్రీ ఎం. ఓంకార్ (నర్సంపేట)—అధ్యక్షా, మాతో నిన్నటి వరకు కలిసి మెలసి ఉన్న గౌరవ సభ్యులు శివలాలు గారు హఠాన్మరణం చెందడం బాధాకరమైన విషయం. దు:ఖాన్ని కలిగించే విషయం. ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ ఆయన తాను నమ్మిన ఆదర్శం ప్రకారం ప్రజలకు సేవ చేసిన వ్యక్తి. ఈ విషయం నిన్ననే తెలిసి చాలా బాధ పడ్డాము. వారి మరణానికి ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ సి హెచ్. రాజేశ్వరరావు(సిరిసిల్ల):—అధ్యక్షా, సభా నాయకులు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి ఆమోదం తెలుపుతున్నాను. శివలాలు గారి అకాల మరణం హైదరబాదు పట్టణంలో ప్రజా ఉద్యమానికి ఎంతో లోపం కలుగచేస్తుంది. చిన్న వయస్సులోని వారు. అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. వారు హఠాత్తుగా మరణించడం దురదృష్టకరం. వారికుటుంబానికి పార్టీ తరపున సానుభూతి తెలుపుతూ వారికి జోహార్లు అర్పిస్తున్నాను.

శ్రీ పి. జనార్ధన రెడ్డి(కమలపూర్):—అధ్యక్షా, శివలాలు గారు మరణించారంటే నమ్మ శక్యం కాదు. నిన్న ఉండి ఈ రోజున వారులేరు. మనస్సుకు ఎంతో బాధాకరంగా ఉంది. తోటి శాసన సభ్యులు, ఎంతో ఉత్సాహంతో పని చేసే వారు. వారు ముందుగా లేస్తూ ఉత్సాహంగా ప్రశ్నలు వేస్తుండే వారు పట్టణంలో చాలా వెలితిగా ఉంది. ఇటువంటి వారికి మా పార్టీ తరపున వారి ఆత్మకు శాంతి కలుగాలని కోరుతూ వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎం. వెంకయ్య నాయుడు(ఉదయగిరి):—అధ్యక్షా, మిత్రుడు శివలాలు గారికి నిన్న ఈ విధంగా హఠాన్మరణం సంభవించడం దురదృష్టకరం. వారు శాసనసభ్యులుగా ఉంటున్న సందర్భంలో, అధికార పార్టీ అయిన కాంగ్రెసులో వారు ఉండినప్పటికి ఎన్నో పర్యాయాలు ప్రజాహిత సమస్యలపై వారితో మాట్లాడడం జరిగింది. వారికి ఇష్టమైన హిందీ భాషలో వారు మాట్లాడేవారు,

పార్టీతో నిమిత్తం లేకుండా ప్రజా సమస్యల విషయంలో అనేకసార్లు శాసన సభలో ఆందోళన చేయడం జరిగింది. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మిత్రులు శివలాలు గారు నా వద్దకు వచ్చి తమ ఏరియా అయిన ధూల్ పేటలో జరిగే ఉత్సవానికి తప్పనిసరిగా రావాలని స్వయంగా వచ్చి ఆహ్వానించారు. ముఖ్యమంత్రిగారిని ఆ సందర్భంలో తీసుకువెళ్ళి ఉత్సవాలను జయప్రదం కావించారు. నిన్న కూడా ప్రజా కార్యక్రమంలో పాల్గొంటున్న సమయంలో గుండెపోటు రావడం వెంటనే చనిపోవడం దురదృష్టకరమైన విషయం. శాసన సభలో వారు లేని లోటు మిగిలిపోతుంది. మా పార్టీ తరపున వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ వారి ఆత్మ శాంతికి భగవంతుని ప్రార్థిస్తున్నాను.

(శ్రీమతి జి.సరోజిని పుల్లారెడ్డి) మునిసిపల్ పరిపాలనా శాఖమంత్రి:— అధ్యక్షా, జాతస్య మరణం ధృవం అన్నారు. పుట్టిన వారు గిట్టకతప్పదు. అయితే కొందరి పేరు తమ మంచితనం వల్ల సంఘంలో నిలిచిపోతుంది. శివలాలు గారిని దీనికి ఉదాహరణగా చెప్పవచ్చును. సోదరుడు శివలాలు గారు ఉత్సాహంతో పని చేసే వారు. నిన్న చూస్తే వారి నియోజక వర్గంలో రోదన చేయని వారు లేరు అనిపించింది. వారి ఆర్థిక పరిస్థితి ఎంతో బలహీనంగా ఉంది. వారి కుటుంబానికి ఏమైనా చేయగలమా అనేది ఆలోచించాలని నేను మా నాయకులు ముఖ్యమంత్రిగారికి మనవిచేస్తున్నాను. మదనమోహన్ గారు చెప్పినట్లు, ఎంతో ఉత్సాహంతో వారు తమ పార్టీ నియోజకవర్గంలో పనిచేసే వారు. సహృదయులు, చాలా శాంతంగా మాట్లాడేవారు. చాలా మంచివారు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతున్నాను. వారి కుటుంబానికి భగవంతుడు ధైర్య సాహసాలు ఇవ్వాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ టి. అంజయ్య (రామాయంపేట):—అధ్యక్షా, శివలాలు మనందరిని ఇంత తొందరగా విడిచి వెళతాడని ఎవరం ఎన్నడూ అనుకో లేదు. రోజూ టెలిఫోనులో మాట్లాడుతూ ఉండేవాడు. మొన్ననే గణేశ ఉత్సవం సందర్భంలో మాట్లాడారు. గణేశ్ చేసే ఆర్టిస్టులకు హాండీక్రాఫ్ట్స కార్పొరేషను ఆయన చైర్మన్‌గా ఉన్నారు కనుక వారికి ఏదైనా సహాయం చేసే కార్యక్రమం చేయాలి అని చెప్పాను. ఇదివరకు కారవాన్ నియోజకవర్గంనుంచి పోటీ చేసిన రావాలంటే చాలా కష్టంతో కూడుకున్న విషయమని అందరికీ తెలిసినదే. వారెంతో కష్టపడి పనిచేసే వారు. వారి నియోజక వర్గానికి హైదరాబాదు పట్టణానికి వారు లేని లోటు తీర్చజాలము. వారు, జనార్దనరెడ్డి గారు, రామదాసు గారు, సంతోష రెడ్డి గారు కలిసి పని చేసేవారు. ఆటీంను చూస్తే ఎంతో సంతోషంగా ఉండేది. నిజానికి ఏమి చెప్పాలో నాకు తోయడం లేదు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతున్నాను.

ముఖ్యమంత్రి శ్రీ బి. వెంకట్రాం:—అధ్యక్షా, జీవితం ఎంత బుద్బుద ప్రాయమో శ్రీ శివలాలు గారి హఠాన్మరణం మనకు రుజువు చేస్తుంది. రెండు రోజులు

క్రితం ఆయన తన నియోజక వర్గంలో గణేశ ఉత్సవంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటూ నన్ను తీసుకువెళ్ళి గణేశ నిమజ్జన ఉత్సవంల ప్రక్రియలో ప్రారంభం చేసేట్లు చేసారు. ఆ నాడు ఆయన చాలా ఉత్సాహంగా ప్రజలందరిని క్రమ శిక్షణతో నడిపిస్తూ అందరి మన్ననలను ఆకర్షణను పొందారు. అందరి ప్రేమను చూరగొన్న ఉత్సాహ వంతుడైన యువకుడు. ప్రజలకు సంబంధించిన అన్ని కార్యకలాపాల్లోను శాసన సభా కార్యకలాపాల్లోను ఉత్సాహంగా పాల్గొనే వాడు. చాలా చిన్న వయస్సులో హఠాత్తుగా ఏ అనారోగ్యం లేకుండా చనిపోయే పరిస్థితి వచ్చింది. చాలా పేదతనంతో బాధపడే కుటుంబం, అనేక మంది ఆయనపై ఆధారపడిన వారున్నారు. ఆయన మరణించిన తరువాత కూడా మృత దేహం చూస్తే చిరునవ్వుతో, చనిపోయాడా లేక నిద్రపోయాడా అన్నట్లు ప్రశాంత వదనంతో ఉన్నాడు. ఆయన మనందరికి చిరస్మరణీయుడు. ఆయన లేని లోటు మా పార్టీకి తీర్చడం చాలా కష్టమైన విషయం. ఒక ఉత్సాహవంతుడు, ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేయగల శాసన సభ్యుని మనం కోల్పోయాం. మా పార్టీకి, హైదరాబాదు పట్టణానికి ఆయన మరణం తీరని లోటు. వారి కుటుంబానికి నా ప్రత్యేకమైన సానుభూతి తెలుపుతున్నాను వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతున్నాను.

శ్రీ పి. వి. చౌదరి (దేవాదాయ శాఖమంత్రి):—అధ్యక్షా, మన సోదర శాసన సభ్యుడు శివలాలుగారి అకాల మరణానికి సభా నాయకులు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి నూటికి నూరుపాళ్లు బలపరుస్తూ వారు క్రమ శిక్షణతో యుద్ధ సైనికునిమాదిరి నీతి నియమాలతో పార్టీ నియమాలను అనుసరించి ప్రజా ప్రతినిధిగా అనేక కార్యక్రమాల్లో పాల్గొనే వారు. అలాంటి వారు అకస్మాత్తుగా చిన్నవయస్సులోనే మృత్యువాత పడడం ఎంతో దురదృష్టకరం. మానవ సేవయే మాధవసేవ యని గుర్తించి ఆ మార్గాన్ని అనుసరించిన వారు తమ నియోజకవర్గంలో ఏ దేవాలయం కార్యక్రమం జరిగినప్పటికి అందరిని ఆహ్వానించి భక్తితో ఆ కార్యక్రమాన్ని జరిపించే యువకులు. వారి మరణానికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబానికి నా సానుభూతి తెలుపుతున్నాను. వారి ఆత్మకు శాంతి కలిగించాలని సర్వేశ్వరుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జనార్ధనరెడ్డి:—అధ్యక్షా, శివలాలు, నేను, సంతోష రెడ్డి, రాముదాము కలిసిమెలసి ఒక వర్గంగా ఉండేవారం. అన్ని సమయాలలో వారు సలహాలిస్తూ ఎన్నో విధాల సహాకారం చేసేవారు. నిన్న ప్రొద్దుట నా నియోజక వర్గంలో ఒక ఫోటో స్టూడియో సెల్ఫ్ ఎంప్లాయిమెంటు స్కీము క్రింద ఒక యువకునికి సహాయం లభిస్తే దానిని ఇనాగరేట్ చేయాలని ఆహ్వానించినప్పుడు నేను కారులో వెళ్ళేటప్పుడు ఎంతో సంతోషంగా మాట్లాడారు. పార్టీ విషయాలు మిగతా ఎన్నో విషయాలు మాట్లాడుతూ వెళ్ళాము, వారేమి బాధతో కాని జబ్బుతో కాని ఉన్నట్లు తెలియదు. అక్కడకు పోయిన తరువాత స్టూడియో వద్ద

కొబ్బరికాయ కొట్టారు. తరువాత రిబ్బన్ కట్ చేసినతరువాత ఫోటో స్టూడియోలో ఫోటోలు తీయడం జరిగింది. ఇద్దరిగా ఉన్న ఫోటోను ఫోటోగ్రాఫరు సపరేట్ చేస్తే మనలను ఫోటోగ్రాఫరు సపరేట్ చేస్తున్నాడని ఇంకా కొన్ని జోక్స్ వేస్తూ మాట్లాడారు. మాట్లాడుతూ మాట్లాడుతూ హఠాత్తుగా ఫోటోలు గుర్తిస్తుండగానే పడిపోయారు. అప్పుడే ఆర్థోపెడిక్ హాస్పటలుకు తీసుకువెళ్లాం. హార్ట్ ఎటాక్ అనుకోలేదు అక్కడకు పోయిన తరువాత డాక్టర్లు ఏమి చేయాలో చేశాడు, శ్రద్ధ తీసుకున్నారుకాని రక్షించలేకపోయారు. వెనుకబడిన ప్రాంతమైన ధూల్ పేట నియోజకవర్గంనుంచి వచ్చారు. కారవాన్ నియోజక వర్గంలోని సబ్జిమండి ప్రాంతంలో మత కలహాలు జరిగినప్పుడు వారు హిందువులను ముస్లిములను రెండు కళ్ల మాదిరి చూసుకుంటూ వారికి రక్షణ ఇచ్చేవారు. దూల్ పేట నియోజక వర్గంలోని లోధిక్షత్రియులను వెనుకబడిన వారిగా తీసుకుని వారికి అభివృద్ధి కల్పించాలని వారికివచ్చిన గుడంబా అనే చెడ్డ పేరు తీసివేయాలని ఎంతో కష్టపడి పనిచేసారు.

అంజయ్యగారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు శివలాల్ గారిని హ్యాండి క్రాఫ్ట్స్ కార్పొరేషన్‌కు చైర్‌మన్‌గా వేసిన తరువాత మొన్నటివరకూ కూడా చాలామందికి అప్పులు ఇప్పించారు. వారి నియోజకవర్గంలో వినాయకచవితి ఫంక్షన్‌కు ముఖ్యమంత్రిగారి వద్దకు వచ్చి ఒక గంట కూర్చుని మీరు తప్పక రావాలి సార్ అని పిలుసుకు తీసుకువెళ్లారు. ఒక్క కాంగ్రెస్ వర్గం వారు అనే కాకుండా వారు ప్రతిపక్షం వారిని కూడా ఆహ్వానించి తాము చేసిన పనులను అంతవరకూ చూపే వ్యక్తి. నాకు సోదరుని లాంటి వారు. ఆయన చనిపోయారంటేనే నాకు నమ్మకం లేకుండా వుంది. వారిపై వారి కుటుంబమే గాక ఇంకెన్నో కుటుంబాలు ఆధార పడి వున్నాయి. ఎందరికో వారు సహాయం చేస్తూవుండేవారు. అదే హార్ట్ఎటాక్ నాకూ వచ్చి వారితో పాటు నేనూ చనిపోయివుంటే బాగుండేది. వారు లేని లోటు నేను భరించలేకున్నాను. వారు ఆత్మకు శాంతి కలుగచేయాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

శ్రీ ఎస్. అళ్వార్ దాస్ (విద్యాశాఖ స్టేట్ మంత్రి):— అధ్యక్షా, ప్రేమతో పలుకరించే ఒక సహృదయం గల వ్యక్తిని మనం కోల్పోయాము. ప్రజల శ్రేయోభిలాషిని కోల్పోయాము. ప్రజల సమస్యలతో సతమతమయ్యేకొద్ది మంది సభ్యులలో వారు ఒకరు. నేను నిన్న రాత్రి వెళ్ళి చూశాను. ఆరుగురి పిల్లలతో ఆ తల్లి రోదిస్తూవుంటే చూడలేకపోయాను. భృతి కోసం పని చేసే ఉద్యోగునికి, కార్మికునికి మనం రక్షణ కల్పించాము. వారు చనిపోతే వారి కుటుంబాలకు సహాయపడుతున్నాము, ప్రజల కోసం పని చేసే సభ్యులకు రక్షణ కల్పించలేమా వారి మరణానంతరం వారి కుటుంబాలకు సహాయపడలేమా అని అనిపించింది. శివలాల్‌గారిపై చాలామంది ఆధారపడివున్నట్లు కన్పించింది. వారి పరిస్థితి చూస్తుంటే ఆ తల్లి ఆ పిల్లలతో ఆ సంసారాన్ని ఎలా నెట్టుకువస్తుందా అనిపించింది. ముఖ్యమంత్రిగారు వారి కుటుంబ పరిస్థితి గురించి ఆలోచించి

వారిని ఆదుకొనే పద్ధతి చూడవలసిందిగా, వారి పిల్లలకు విద్యా సౌకర్యం కలిగేటట్లుగా చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను వారి ఆత్మకు భగవంతుడు శాంతి కలుగ చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

శ్రీ ఎ. వీరప్ప (చేనేత, జౌళి మరియు వెనుకబడిన తరగతుల శాఖల మంత్రి) :—అధ్యక్షా, భరించరాని విషాద వార్త శివలాల్ గారి మరణ వార్త నాకు చాలా బాధ కల్గించింది. ప్రజా కార్యక్రమాలలో సన్నిహితంగా వుంటూ అకస్మాత్తుగా మరణించడం చాలా విచారకరం. నన్ను అనేక సార్లు వారి నియోజక వర్గానికి ఆహ్వానించి తాము చేస్తున్న కార్యక్రమాలను చూపేవారు. వెనుకబడిన వర్గాలకు ఎంతో సహాయపడి, వారి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన వ్యక్తి. వారి మరణానికి నా సంతాపం తెలియచేస్తూ వారి ఆత్మకు శాంతి కలుగచేయా అని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి నా సంతాపం తెలియచేస్తున్నాను.

రోడ్లు భవనముల శాఖ మంత్రి (శ్రీ ఎమ్. మాణిక్ రావు):— అధ్యక్షా, నిన్న సాయంత్రం శివలాల్ గారు హార్ట్ ఎటాక్‌తో మరణించారన్న వార్త నాకు ఎంతో దుఃఖాన్ని కలిగించింది. వారు శాసనసభ్యులు కాకముందు నుండీ నాకు తెలుసు, 1946-48 ప్రాంతంలో నిజాంకు వ్యతిరేకంగా, ఆర్.ఎస్.ఎస్. సమాజ కార్యకర్తగా పని చేసిన రోజులు నాకు జ్ఞాపకం వున్నాయి. వారు గ్రాడ్యుయేట్. ధూల్‌పేట ప్రాంతంలో యువ నాయకుడుగా వుండేవారు. వారి కుటుంబాలలో చదువుకొని పైకి రావాలంటే చాలా కష్టం. వారు మంచి కబాడి ప్లేయర్. నిజాం కాలంలో ధూల్‌పేట ప్రాంతంలో పెద్ద పులిగా వుండేవారు. ప్రతివారిని నవ్విస్తూ వుండేవారు. ఎప్పుడూ హిందిలో మాట్లాడుతూ వుండేవారు. చిన్న వయస్సులోనే వారిని భగవంతుడు మననుండి దూరం చేశాడు. వారితో నాకు గల సన్నిహిత సంబంధం నేనెప్పుడూ మరిచిపోలేను. నా తమ్ముడిగా భావించాను. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబానికి నా సంతాపం తెలియచేస్తున్నాను.

శ్రీ నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి (వెంకటగిరి):— అధ్యక్షా, 1978 లో శివలాల్ గారు శాసనసభ్యులుగా ఎన్నికయినప్పటి నుండి మేము కలిసి మెలిసి వుండే భాగ్యం నాకు కలిగింది. అంజయ్యగారి నాయకత్వంలో పి. జనార్ధన రెడ్డిగారు, శివలాల్ గారు జంట కవులుగా, యువ కార్యకర్తలుగా వుండేవారు. శివలాల్ గారు చిన్నప్పటి నుండి ప్రజాసేవ ధ్యేయంగా పెట్టుకున్న వ్యక్తి, నిన్న కాక మొన్న శివలాల్ గారు నా ప్రక్కన కూర్చుని అన్నా, సోమవారం నా నియోజక వర్గానికి సంబంధించిన ఒక విషయం సభలో ప్రస్తావిస్తున్నాను, మీరు దానిని బలపరచాలి అని, కాగితం నాకు ఇచ్చారు. తప్పక మాట్లాడతామని వారికి నేను మాట ఇచ్చాను. కాని వారిచ్చిన అంశం శాసనసభలో చర్చకు రాకముందే వారు అకాలమరణ పొందడం దురదృష్టం. వారి మధుర స్మృతులు మరువరానివి,

వారినెప్పుడూ మర్చిపోలేము. వారి మరణానికి నా సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలియచేస్తున్నాను.

శ్రీ పి. గోవర్ధన రెడ్డి:— అధ్యక్షా, శివలాల్ గారు లేరనుకోవడం చాలా బాధగా వుంది. నిన్న సాయంత్రం నేనూ నరసింహారెడ్డి గారు ఒకచోట వుండగా ఈ వార్త తెలిసింది. మాకది పెద్ద షాక్ అనిపించింది. నాకు శివలాల్ గారు పది సంవత్సరాలుగా తెలుసు. వారు ఎన్నో ఉద్యమాలలో నిర్భయంగా పాల్గొనిన వ్యక్తి. నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. బోనాల పండుగ సందర్భంలో తన నియోజక వర్గానికి నన్ను పిలిచి ఆ కార్యక్రమం నా చేతి మీదుగా జరిపించారు. నాకెంతో సంతోషం కలిగింది ఆ ఫంక్షన్‌లో హిందువులు, ముస్లింలు కలిసి పాల్గొన్నారు. వారు నన్ను నాలుగైదు ప్రదేశాలకు తీసుకువెళ్లారు. ఎక్కడకు వెళ్ళినా ప్రజలు వారిని ప్రేమతో అభిమానంతో చూస్తూ వుంటే నాకెంతో సంతోషం కలిగింది. ఎసంబ్లీలో ఎప్పుడూ అధ్యక్ష మహాశయా అంటూ హిందీలోనే మాట్లాడేవారు. అటువంటి వ్యక్తి ఈనాడు మన మధ్య లేరు. వారి కుటుంబం చాలా పెద్దది. వారు ఏ విధంగాను ధనం ఆర్జించలేదు. వారి కుటుంబాన్ని ఆదుకోవలసిన కర్తవ్యం మనందరి మీదా వుంది. ముఖ్యమంత్రిగారు ఆ విషయం ఆలోచిస్తారని ఆశిస్తూ వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియ చేస్తూ ఈ తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ ఎస్. సంతోష్ రెడ్డి (ఆర్మూర్):— అధ్యక్షా, నేను మొట్టమొదట 1978లో శాసనసభలో అడుగుపెట్టగానే నాకు శివలాల్ గారితో మొదట పరిచయం అయింది. జనార్దనరెడ్డిగారితో పరిచయం అయింది. మేము ఈ నాలుగు సంవత్సరాలు పాటు స్నేహితులముగా అప్త మిత్రులముగా గడిపాము. విడలేని సంబంధంగా గడిపాము. ఆయన లేని లోటు మా ఇద్దరికి ఎప్పటికి తీరని లోటుగా మిగిలి పోతుంది. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం నిర్భయంగా పోరాడిన వ్యక్తి అయన. వారి కమ్యూనిటిని పైకి తీసుకురావాలని ఎంతో తాపత్రియపడిన వ్యక్తి. వారి మరణం వారి కమ్యూనిటికి మరింత లోటు. శనివారం నాడు మేము కలుసుకున్నప్పుడు నా నియోజకవర్గంలో 25 వేలమంది లోధా క్షత్రియులు వున్నారు. వారు దుర్భర పరిస్థితిలో వున్నారు. నికృష్ట జీవితం గడుపుతున్నారు. వారి విషయమై నేను ఎస బ్లీలో 329 ఒకటి ఇచ్చాను, దాని చర్చ సందర్భంలో మీరంతా సహకరించాలి అన్నప్పుడు మేము దానిపై సంతకము పెట్టడం జరిగింది కాని వారి ఆ కోర్కె తీరకుండానే వారు మరణించారు. వారి ఆత్మశాంతి కొరకైనా వారి కమ్యూనిటీ వడే ఇబ్బందులను ప్రభుత్వం తీర్చాలని మనవి చేస్తున్నాను. వారు హిందీలో మాట్లాడుతుంటే హిందీ రానివారికి కూడా వినాలనిపించేటంత మృదు మధురంగా మాట్లాడేవారు. శాసనసభ్యులు వారి కుటుంబానికి సహాయం చేస్తే బాగుంటుందనుకుంటున్నాను. వారి మరణానికి నా సంతాపం తెలియచేస్తున్నాను.

శ్రీ బి. రామారావు (జగ్గయ్యపేట):— అధ్యక్షా శివలాల్ గారూ మేమూ కలిసిమెలిసి వుంటూ వుండేవారం. అధ్యక్షా మహాశయ్ అంటూ వారు

హిందీలో తమ ఉపన్యాసం ప్రారంభించేవారు నన్ను రామన్నా అని నోరారా పిలిచిన వ్యక్తి, ఆయన ఈరోజు మన మధ్య లేకపోవడం దురదృష్టం, జంట నగరాలలో ఎక్కడకు వెళ్ళినా రామదాసుగారు, జనార్ధనరెడ్డిగారు, శివలాల్ గారు నన్ను పిలిచి రామన్నా, కారు ఎక్కు అని తీసుకువెళ్ళేవారు, తమ స్వంత సోదరుని మాదిరి నన్ను చూసుకొనేవారు ఏసమస్య చర్చకు వచ్చినా నవ్వుతూ, చమత్కరిస్తూ మాట్లాడేవారు. కొందరు బ్రతికి వుండగా చనిపోతారు, కొందరు చనిపోయి బ్రతికుతారు అలా చనిపోయినా బ్రతికేవ్యక్తి శివలాల్‌గారు. వారి మరణానికి నా తీవ్ర సంతాపం తెలియచేస్తూ వారి ఆత్మకు శాంతి గలుగ చేయాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

శ్రీ బి. కృష్ణ (ఆసిఫ్‌నగర్) — అధ్యక్షా, సోదరుడు శివలాల్ నిన్న మరణించారు అన్న వార్త నమ్మశక్యం కాలేదు వరప్రసాద్‌గారింటికి ఫోన్‌చేస్తే చనిపోయారని తెలిసింది వారెంతో ఆరోగ్యంగా వుండేవారు, ఈ మధ్య క్లాస్‌లో నేను ఏమయ్యా శివలాల్, చిక్కిపోతున్నావ్ అని అడిగితే డయిట్ కంట్రోల్ చేస్తున్నానని చెప్పారు. ప్రతి సంవత్సరం గణపతి ఉత్సవాలకు ఎంతో ఖర్చుచేసి ఘనంగా జరిపేవారు వారి నియోజక వర్గానికి నిర్విరామంగా కృషిచేశారు. ఎప్పుడూ వారి కమ్యూనిటీ గురించి ఆలోచిస్తూ వుండేవారు, వారు కబాడి ప్లేయర్, తమ నియోజకవర్గంలో ఎన్నో మార్పు తీసుకురావాలనుకునేవారు. వారి మరణం ఆ ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టమని మనవిచేస్తూ వారి ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని కోరుతున్నాను.

శ్రీ నాయని నరసింహారెడ్డి (ముషీరాబాద్): — అధ్యక్షా నిన్న ప్రాంతీయ వార్తలలో శివలాల్‌గారి మరణవార్త వినగానే దిగ్భ్రాంతి చెందాను. మొన్న నాతో మాట్లాడుతూ మా బస్తీకి సంబంధించి రిక్వెస్టు ఇచ్చాను, మీరంతా నాతో సహకరించాలి, మాట్లాడాలి అని అడిగారు, ఈనాడు వారు మన మధ్య లేకుండా పోయారు. ఏపార్టీకి చెందినప్పటికి శివలాల్‌గారికి నాకు పదిహేను సంవత్సరాల నుండి పరిచయం వుంది, అద్దరం సోషల్ యాక్టివిటీస్‌లో కలిసి పనిచేశాము. వారి మరణం ఈ సిటీ ప్రజలకు తీరని నష్టం వారికి భగవంతుడు ఆత్మశాంతి కలుగచేయాలని కోరుతూ వారి కుటుంబానికి నా సంతాపం తెలియచేస్తున్నాను

శ్రీ బి సమ్మయ్య (మత్స్యశాఖ మంత్రి) — అధ్యక్షా శివలాల్‌గారి మరణ వార్త వినరాని ఘోరమైన వార్త, భగవంతుడు ఆయనను చిన్న వయస్సులోనే తీసుకుపోవడం ఘోరం వారినుండి ప్రజలు ఎన్నో మంచి పనులు ఆశించారు. వాటిని నెరవేర్చకుండానే వారు ఈ లోకాన్ని విడిచి వెళ్ళడం చాలా బాధాకరమైన విషయం పదిరోజుల క్రింగట నేనూ, బాగారెడ్డిగారు వారి ఆహ్వానంపై వారి నియోజకవర్గంలో పర్యటించాము. ధూల్‌పేటలో గణపతి విగ్రహాలను తయారుచేసి జీవించే కుటుంబాలు చాలా వున్నాయి. ఆ ఇండ్లకు మమ్మల్ని తిప్పి వారి కష్టాలన్నీ మాకు చెప్పి, వారి ఆర్థిక ఇబ్బందులు ఎలా తీర్చాలన్న

విషయాన్ని మాట్లాడటం జరిగింది. కనిపించిన ప్రతివారిని అప్యాయంగా పలుకరించి వారి సమస్యల గురించి తెలుసుకొనేవారు. అలాంటి స్నేహశీలి మనల సందర్భనగా విడిచి వెళ్ళటం విచారకరం. వారి ఆత్మశాంతికి అయినా వారు చేపట్టిన కార్యక్రమాలను పూర్తి చేయవలసివుంది. వాటికి ప్రభుత్వం సహకరించవలసివుంది వారి మరణానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తున్నాను.

శ్రీ ఎమ్. తులసీదాస్ :— అధ్యక్షా, నాకు శివలాల్ గారితో పరిచయం గోవిందసింగ్ గారి ద్వారా కలిగింది. నేను హిందీలో మాట్లాడాలనీ, వారు తెలుగులో మాట్లాడాలని ఒప్పందం చేసుకున్నాము. నాకు చాలా స్నేహపాతుడు. నిన్న వారింటికి వెళ్ళినప్పుడు అక్కడి ప్రజల ఆక్రందన వింటే ఏ క్రమమైన పరిస్థితులు ఏర్పడతాయోనన్నంత భయం వేసింది. దాదానిబట్టి వారి పట్ల ప్రజలలో ఎంతటి ప్రేమాభిమానాలు వున్నాయో తెలిసింది. దూలిపేట ప్రాంతంలో అటువంటి కార్యకర్త తిరిగి లభించడం చాలా కష్టం మత సామరస్యంతో, అందరనూ సమన్వయ భావంతో చూస్తూవుంటే వారు 40 సంవత్సరాలు నిండకముందే మృత్యువాత పడటం విచారకరమైన విషయం. ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ గౌతు లచ్చన్న (సోంపేట) :— అధ్యక్షా, సభానాయకులు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని లోక్‌దళ్ పక్షాన బలపరుస్తున్నాను. శివలాల్ గారు శాసన సభ్యులుగా నాకు పరిచయం తప్ప వారితో వ్యక్తిగతమైన పరిచయం నాకు తెలియకపోయినా వారు సభలో హిందీలో మాట్లాడుతున్నప్పుడు హిందీ రానివారికి కూడా వినాలనిపించేట్లుగా ప్రజా సమస్యల గురించి మాట్లాడేవారు. చాల భవిష్యత్తుగల యువకులు చిన్న వయస్సులో చనిపోవడం బాధాకరమైనదే. వారి ఆత్మకు శాంతి కలగాలని మా పార్టీ తరఫున కోరుకుంటూ వారి కుటుంబానికి మా సానుభూతిని తెలియచేస్తున్నాను.

శ్రీ ఎస్. జైపాల్‌రెడ్డి (కల్వకుర్తి) :— అధ్యక్షా, సభా నాయకులు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానంతో ఏకీభవిస్తున్నాను. శివలాల్ గారితో నాకు రెండు దశాబ్దాల కంటే ఎక్కువ పరిచయం వుంది. కాలేజీలో సహచరులుగా వుండేవారం, ఆనాటి నుండి నేటి వరకూ వారిలో నేను చూసింది, ఆత్మాభిమానం, అంతేగాక చాలా పట్టుదల గలిగిన వ్యక్తి. వారికి కొన్ని పరిశుద్ధమైన ఆలోచనలు, అభ్యాసాలు వుండేవి. వారు శాసన సభ్యుడు అయిన తరువాత ఈ శాసనసభలో చక్కటి హిందీలో మాట్లాడేవారు. ఆయన ఏనాడు తన హుందాతనాన్ని పోగొట్టుకోలేదు. వారికి ప్రజలతో సన్నిహిత సంబంధాలు వుండేవి. ఆయనకు ప్రజా సమస్యల పట్ల ఎంతో ఆపేక్ష ఉండేది. అటువంటి వ్యక్తి అకాలమరణం పొందడం జరిగింది. ఆయన మరణం చాలా తీరని లోటని మనవిచేస్తూ ఆయన

ఆత్మకు భగవంతుడు శాంతిని కలుగజేయాలని కోరుచున్నాను. ఆయన కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి కె. ప్రభావతమ్మ (రాజంపేట):— అధ్యక్షా, 1978 లో ఎలక్షన్సు అయిన తరువాత ఆయన ఇక్కడికి వచ్చిన తరువాత నాకు పరిచయం కలిగింది. ఈనాడు ఆయన అకాల మరణానికి గురి అయ్యారు. ఇది చాలా ఘోరమైన విషయం. వారి కుటుంబ పరిస్థితి గురించి 10 మంది చెబితే వింటున్నాము. ఆయన కుటుంబానికి తోటి శాసన సభ్యులుగా కొంత సహాయము చేయవలసిన బాధ్యత వుందని నేను భావిసున్నాను. ఈ సందర్భంగా లెజిస్లేటర్సు అందరూ కలసి వారి కుటుంబానికి ఒక రిలీఫ్ ఫండును ప్రారంభించి సహాయము చేస్తే బాగుంటుందని నా అభిప్రాయము. ఈ సభాముఖంగా ఒక కమిటీని ఏర్పరుస్తే బాగుంటుంది. ఒక వెయ్యి రూపాయలు విరాళంగా యివ్వాలనే ఉద్దేశం నాకు వుంది. ఈ విధంగా ఒక రిలీఫ్ ఫండును ప్రారంభించి ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని మనవిచేస్తున్నాను. వారి కుటుంబానికి నా సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ బి. వెంకటరాం:— అధ్యక్షా, సభాముఖంగా ఆ విధంగా చేయడము మంచిది కాదేమో. ఏమి చేసినా వ్యక్తిగతంగా ఆలోచించి చేయవచ్చును. ప్రభుత్వం వైపునుంచి ఏమైనా చేయవచ్చును. కాని యిట్లాగ ఎనౌన్సు చేస్తే ఆయన కుటుంబానికి గౌరవప్రదంగా వుండదేమో. అందరూ కలసి ఏదో ఒక పనిచేసి ఒక రోజున అక్కడికి వెళ్ళి వారిని సత్కరించి ఇస్తే బాగుంటుందికాని యిట్లాగ ఎనౌన్సు చేస్తే బాగుండదు. గౌరవసభ్యులు నేను చెప్పినదానికి అపార్థం చేసుకోవద్దని మనవి చేస్తున్నాను.

శ్రీ సి. దాస్:— మిత్రులు శివలాల్ గారు మంచి కార్యకర్త. మా పార్టీ ఒక మంచి కార్యకర్తను, మంచి శాసన సభ్యుడిని పోగొట్టుకోవడం దురదృష్టం. ఆయనది చిన్న వయస్సు. ఆయన అకాల మరణం చెందడం దురదృష్టము. శ్రీ అచ్చన్నగారు చెప్పినట్టు ఆయన ఈ సభలో హిందీలో మాట్లాడినా ఆ హిందీ చాలా సున్నితంగా వుండేది. హిందీ రానివారికి కూడా అర్థమయ్యేట్టు వారు మాట్లాడేవారు. పార్టీకి సంబంధించిన విషయాలను ఎవరయినా వ్యతిరేకించి మాట్లాడినప్పుడు ఆయన వెంటనే లేచి అభ్యంతరం తెలియజేసి తన నిరసనను వ్యక్తం చేసేవారు. ఈ సభలోని అందరియొక్క విశ్వాసాన్ని, అభిమానాన్ని పొందినటువంటి వ్యక్తి ఆయన. ఆయన ఎప్పుడు మంత్రి శ్రీ పి. జనార్ధనరెడ్డి గారితో కలసి జంటగా వెళ్ళేవారు. వారిద్దరికి ఉన్నటువంటి సన్నిహిత సంబంధం అందరికీ తెలుసు. నేను నిన్న తిరుపతిలో ఈ వార్త విని అక్కడి నుంచి సేరుగా వారి గృహానికి వెళ్ళి చూస్తే ఆయన మరణించిన వ్యక్తిగా నాకు కనిపించలేదు. ఆయనలోని తేజస్సు ఆయన ముఖంలో కనిపించింది. ఆయనను చూడడానికి వేలకొలది జనం వచ్చారు. అందరూ వెలవెల బోతున్నారు. గాలిని బట్టి

చూస్తే ఆయన నియోజకవర్గంలో ఆయనకు ఎటువంటి పలుకుబడి ఉందో తెలుస్తుంది. ఆ ప్రాంతంలోని ప్రజలకు ఎంత అభిమానం వుందో తెలుస్తుంది. వాస్తవంగా మా పార్టీ ఒక మంచి కార్యకర్తను పోగొట్టుకున్నదని మనవి చేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి కలుగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ కె. వెంకటరామయ్య (గుత్తి):—అధ్యక్షా, ఉదయం ఊరి నుంచి రాగానే ఈ వార్త తెలిసింది. నేను నమ్మలేకపోయాను. ఆయన ఒక నమ్మకమైన స్నేహితుడు, శ్రీ శివలాల్, శ్రీ పి. జనార్ధనరెడ్డి, శ్రీ రామదాసు, శ్రీ శివప్రసాద్ నలుగురూ నాలుగు స్తంభాలులాగ ఉండేవారు. ఆ నలుగురూ ఎప్పుడూ కలిసి ఉండేవారు. ఆయన ఒక మంచి కార్యకర్తగా పనిచేసారు. అటువంటి కార్యకర్త మరణించడం చాలా బాధాకరంగా ఉంది. ఎలక్షను పిటిషను విచారణ జరిగే రోజులలో ఈ పాయింటు అడగండి, ఆ పాయింటు అడగండి అని చెప్పేవారు. అటువంటి వ్యక్తి అసెంబ్లీలో మాట్లాడుతూ మాట్లాడుతూ మాయమైనట్లు ఉంది. శ్రీ గోవింద్‌సింగు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నప్పుడు అది ఉపసంహరింపజేయుటకు హౌసులోని మెంబర్సుకు నచ్చచెప్పి తద్వారా ఆయన ఉపసంహరింపజేసారు. మంచి వ్యక్తికి మరణం తొందరగా వస్తుందన్నట్లు అయిపోయింది. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతిని కలుగచేయాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ పి. వెంకటేశ్వరరావు:—అధ్యక్షా, మిత్రులు శ్రీ శివలాల్‌గారు ఆకస్మికంగా మరణించడం చాలా బాధాకరంగా ఉంది. గత నాలుగున్నర సంవత్సరాల నుంచి ఆయనతో నాకు చాలా సన్నిహిత సంబంధం ఉంది. ఈ మధ్య ఆయనను హ్యాండిక్రాఫ్ట్స్ డెవలప్‌మెంటు కార్పొరేషనుకు చైర్మన్‌గా నియమించడం జరిగింది. అప్పటినుంచి ఆయన తరచుగా నా దగ్గరకు వస్తూ ఆ విషయాల గురించి చెబుతూ ఉండేవారు. ఆయన ఈ హస్తకళలపట్ల ఆసక్తి చూపిస్తూ వాటిని త్వరలో అభివృద్ధి చేయాలనే ఆతృతతో ఉండేవారు. ఆయనకు హస్తకళలకు దగ్గర సంబంధం ఉండడంవల్ల వాటిపట్ల ఆయన ఎక్కువ శ్రద్ధ చూపించేవారు. ఈ మధ్య చాలామంది మంత్రులను తన నియోజకవర్గానికి తీసుకొని వెళ్ళి అక్కడున్నటువంటి లంబాడావారు తమ దైనందిన జీవితాన్ని ఏ విధంగా గడుపుతున్నారో చూపించేవారు. వారికి ఒక పథకం తయారుచేసి దానిద్వారా వారిని పైకి తీసుకొని రావాలని ఎప్పుడూ ఆలోచించేవారు. దానికి అనుగుణంగానే ఆయన ఈ సభలోనే 329 క్రింద ప్రవేశపెట్టిన విషయం అధ్యక్షులవారికి తెలుసు. మనము ఇపుడు చేయవలసింది రెండే రెండు. ఈ సభాముఖంగా ముఖ్యమంత్రిగారిని కోరేది ఒకటే, శివలాల్‌గారు యింకో ఆరుమాసాలు వుండివుంటే, లెజిస్లేటర్ పెన్షన్‌కు అర్హుడయ్యేవాడు. ఇపుడు లేని కారణము చేత, 50 పర్సెంట్ పెన్షన్ యివ్వడమనేది కాకుండా, ఆయన విడోకు పూర్తిగా పెన్షన్ ఇచ్చేవిధంగా

చేయాలి. ఆయన కుటుంబము చాలా పేద కుటుంబము. పెద్ద కుమారుడు 12 సంవత్సరముల వయస్సు గలడు. అందుచేత వారి పేద కుటుంబానికి ఏదయినా ప్రభుత్వము సహాయము అందచేయాలని మనవి చేస్తున్నాను. జయపాల్ రెడ్డి గారు చెప్పినట్లుగా ఆయన చాలా ఆత్మాభిమానముగల వ్యక్తి. కార్పొరేషన్ ఛైర్మన్‌గా వుండి, దాని గడువు దగ్గరకు వచ్చింది. అయినా దాని పొడిగింపు విషయం గురించి నన్నుగాని, ముఖ్యమంత్రిగారిని గాని వారు స్వయంగా యాచించలేదు. అదే గంభీరత్వంతో పని చేస్తూ, పోతూ వుండేవారు. నేనుకూడా ఈ మధ్యనే ఆలోచన చేసి, ముఖ్యమంత్రిగారి దగ్గరకు పోయి పొడిగింపు విషయం గురించి మాట్లాడాలని నిన్న అనుకొన్నాను. కాని ఆ అవకాశము లేకుండా పోయింది. నేను చెప్పిన ఈ విషయాలు ముఖ్యమంత్రి గారు సవినయంగా ఆలోచన చేస్తారని సవినయంగా మనవి చేస్తూ, వారి కుటుంబానికి నా సంపూర్ణ సంతాపాన్ని తెలియచేస్తూ వారి ఆత్మకు శాంతి కలుగచేయాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ వి. మచ్చీంద్రరావు ( సికింద్రాబాద్-కంటోన్మెంట్ ) :— అధ్యక్షా, శివలాల్ గారు తోటి శాసన సభ్యుడిగా ఉభయనగరాలలో, పట్టణాభివృద్ధికి గాని, పురపాలక సమస్యలపైనగాని వారు చైతన్యవంతంగా మాట్లాడేవారు. ముఖ్యంగా ఓల్డు సిటీని చాలా అభివృద్ధి చేయాలని ఎంతో ఆతురత పడేవారు. నిన్న సికిందరాబాదులో నేనూ, రామదాసు గారు, ఇద్దరమూ వారు గణేశ్ దేవాలయానికి వస్తారని కాచుకొని వుంటే, జనార్ధనరెడ్డిగారు ఈ మరణ వార్త తెలియజేశారు. మాకెంతో దుఃఖకరమైంది, వారి కాన్‌స్టిట్యూయెన్సీకి వెళ్ళి చూస్తే హిందువులే గాని, ముస్లింలేగాని, తక్షణమే దుకాణాలు బందుచేసినారు. వారి ముఖాల్లో సంతోషము లేకుండా వాడిపోయినట్లు కనిపించింది. వారందరూ ఇంత సానుభూతి శివలాల్ గారిపై చూపిస్తున్నారంటే ఆయనపై ప్రజలకు మంచి విశ్వాసముంది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తు, వారి ఆత్మకు శాంతి కలుగాలని దేవున్ని ప్రార్థిస్తు సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ డి. సీతారాములు (నరసన్నపేట): - అధ్యక్షా, సభానాయకులు ప్రవేశ పెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని త్రికరణశుద్ధిగా బలపరుస్తున్నాను. 1978 లో శాసన సభకు ఎన్నికైన తరువాత నేను, శివలాల్ గారు శాసన సభలో సైడ్‌బైసైడ్ కూర్చొనేవాళ్ళము, శివలాల్ నిస్వార్ధ ప్రజా సేవకుడు, వారు లోధుల వృత్తులపట్ల ఎంతో ఆసక్తి, శ్రద్ధ చూపెడివారు, వారు తన నియోజక వర్గ ప్రజలకు వారి పురోభివృద్ధికి ఎంతో ఉత్సాహముతో పని చేసేడివారు. అలాంటి నిస్వార్థ ప్రజానాయకుడు అకస్మాత్తుగా చనిపోయారంటే నేను చాల బాధపడ్డాను. "జాతస్యమరణం ధృవం" అని పెద్దలన్నారు. పుట్టినవాడు ఎవరూ వుండరు, కాని మంచి అనేది కలకాలం నిలిచిపోతుంది. శివలాల్ గారి ఆర్థిక పరిస్థితులు నాకంతగా తెలియవుగాని. సభ్యులు చెప్పిన దాన్నిబట్టి, వారు

కార్పొరేషన్ చైర్మన్‌గా వుంటూ కూడా వారు చాలా ఆర్థిక దుస్థితిలో వున్నట్లు తెలుస్తున్నది. వారికి పిల్లలున్నారు. వారి చదువు సంధ్యల విషయంలో తగిన విధంగా సహాయం చేయవలసిన బాధ్యత ఎంతో వుంది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ సి. నారాయణ రెడ్డి (మంథని) :— అధ్యక్షా, మిత్రుడు శివలాల్ గారి ఆకస్మిక మరణం చాలా బాధకరంగా వుంది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను. శివలాల్ గారు నాకు చాలా సన్నిహితంగా వుంటూ, ఏదైనా పనివుంటే, ఇద్దరం కలిసి మాట్లాడుకొనే వాళ్ళము. దేశ భాష హిందీ అన్న వారికి చాలా ప్రీతి. విద్యా శాఖ వద్దు వస్తున్నప్పుడు వారు ప్రతి జిల్లాకు హిందీ డిగ్రీ కాలేజి కావాలని పోరాడే వ్యక్తులలో వారొకరు. ఇక్కడ హైదరాబాదులో లోధులు అనే క్షత్రియులున్నారు. వాళ్లు చాలా ధైర్యశాలులు. శివలాల్ వారందరి ప్రేమాభిమానాలు పొందారు. వారి ఆత్మకు శాంతి కలుగ జేయాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ భాట్టం శ్రీరామమూర్తి :— అధ్యక్షా, శివలాల్ గారు చాలా వుత్తములు, యువ నాయకులు, చాలా ఆప్త మిత్రులు. ఆయనతో సన్నిహితంగా వున్న ప్రతి ఒక్కరు ఎన్నడూ వారిని మరిచిపోరు. వారు పట్టుదలగల వ్యక్తి. ఆదర్శ ప్రజా సేవకుడు. వారి అకాలమరణానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తు, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతున్నాను.

శ్రీ ఎ. జి. క్రిష్ణ (ఇబ్రహీంపట్నం) :— అధ్యక్షా, సభానాయకులు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. నాకు శివలాల్ గారితో 1978లో ఇందిరాగాంధీ ఇక్కడ టూర్ వచ్చినప్పుడు దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లో స్నేహం ఏర్పడింది. అంతకుముందు వారు నాకు తెలియదు. అప్పటి నుండి వారు నాతో కలుస్తూ, ఎప్పుడో ఒకసారి నీవు ఎం.ఎల్.ఎ అవుతావని అనేవారు. ఈ హౌస్‌లో మాట్లాడుతూ "అధ్యక్ష మహోదయ్, మంత్రి మహోదయ్" అని సంభోదిస్తు వుండేవారు. వారి ఆ మాటలు ఇప్పటికి వారు లేకున్నా నా చెవులో వినిపిస్తున్నాయి మొన్న గణేశ ఉత్సవాలు కాక ముందు; అసెంబ్లీలో వున్నపుడు, ఎక్కడకు పోతున్నావంటే నేను పాలడగు వెంకట్రావు గారి దగ్గరకు వెళ్తు తున్నాను వారిని మా కాన్‌స్టిట్యూఎన్సీకి తీసుకొనివెళ్ళి, అక్కడ వారు చేసే పనులను చూపిస్తాను. అనిచెప్పి, నన్నుకూడా తీసుకొనివెళ్ళారు. మంత్రిగారిని ఇంటి.టికి త్రిప్పి, వారికి సహాయం చేయాలని రెప్రజెంటేషన్ యిచ్చి అందుకు మంత్రిగారు వారికి సహాయం చేస్తామని హామీ కూడా యిచ్చారు. ఎపుడు ఏది వున్నా "క్రిష్ణాభయ్యా" అని వచ్చి, ఇది తప్పు ఇది చెయ్యి అని నాకు సలహా ఇచ్చేవారు వారిపుడు లేకపోవడం చాలా బాధకరంగా వుంది. వారి కుటుంబానికి

నా ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తు, వారి ఆత్మకు శాంతి కలుగచేయాలని భగవంతుని ప్రార్థిస్తు సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి. సురేంద్రరావు (మంచిర్యాల). —అధ్యక్షా, సభానాయకులు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. విభిన్న మనస్తత్వాలు గల వారి మధ్య వారు వుంటూ, ఎవరితో ఏవిధంగా వ్యవహరించాలో వారికి బాగా తెలుసు. ఎవరి మనస్సు నొప్పించకుండా, ఆప్తులు అయ్యేవారు. మంచి మనస్సుగల వ్యక్తి. వారినాడు మనమధ్య లేరు. అందుకు చాలా బాధాకరంగా వుంది. ఎంతో వినయంగా, ప్రేమతో, [illegible] అని నమ్ముకొని పిలిచేవారు. ఆ పిలిచే భాగ్యము ఇప్పుడు లేదు. శివలాల్ గారికి నాకు దాదాపు [illegible] పైగా పరిచయం వుంది. శివలాల్ గారు నిస్వార్థ ప్రజానాయకులు. వారి రోజు లేకపోవడం ఇంతకన్నా దురదృష్టకరమైన విషయం నాలాంటి వారి జీవితంలో వుండదు. చావు ఎవరికైనా సామాన్యం. దాన్ని తప్పించుకునేది ఎవరికి వుండదు. అందువల్ల ఎన్నో ఆశయాలతో ఎందరినో ముందుకు తీసుకుపోయే వ్యక్తి యీ మనముందు లేరు. ఈ శాసనసభలో వారి జిల్లాకు సంబంధించిన సమస్యలు పరిశీలనకు వచ్చినపుడు పొరపాటునయినా వారు ఆలస్యంగా సభకు వచ్చేవారు కాదు. తమ జిల్లాకు సంబంధించిన ఇతర శాసనసభ్యులను కూడా ఆలస్యంగా రావద్దని అనేవారు. అటువంటి నియమములు గల మంచి వ్యక్తి ఈనాడు సభలో లేరు. వారికి నా ప్రగాఢ సంతాపం తెలుపుతూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని కోరుతూ శలవు తీసుకుంటున్నాను.

شری سلطان صلاح الدین اویسی :- جناب اسپیکر صاحب - ہاؤز میں جو قرارداد تعزیت پیش کی گئی ہے میں اور میری پارٹی اسکی پوری تائید کرتی ہے۔ میں بڑے دکھ اور افسوس کا اظہار کر رہا ہوں کہ ایک نوجوان کی بے وقت موت ہو گئی۔ میں اور میری پارٹی ان کے پسماندگان سے دلی ہمدردی کا اظہار کرتے ہیں اور ان کے رنج میں شریک ہیں۔

Mr. Dy. Speaker:- In Sri Shivlal, the House lost one of its young and energetic members. Shri Shivlal has always been speaking chaste Hindi and is loved by all. He was born at Ambicbagh Dhoolpet, Hyderabad. He represented Karwan Constituency of the city of Hyderadad. He studied at Varanasi, V.V. College and the Nizam College. H was Trustee of Kesari Hanuman Temple, Secretary of several Managing Committees and Member of B.V.P.S. Samithi, Adviser, Abhyudaya Oriental College. He was Chairman of Handicrafts Development Corporation. He own prizes in his College days in debating competitions. In him we lost an young 40 year old member. May his soul rest in peace.

I associate myself with the sentiments expressed by the member of the House and let us observe silence as a mark of respect to the departed soul.

The Motion was adopted Nem Con.

ANNOUNCEMENT :

re : Reports included in the agenda
to be presented deemed to have
been presented.

Mr. Dy. Speaker :—The business posted to-day-will be taken up tomorrow at 4–00 p.m. The Reports to be presented to-day will be deemed to have been presented to-day.* As a mark of respect let us adjourned the Assembly for the day. The House stands adjourned to meet again at 8-30 a.m., to-morrow.

(The House then adjourned to meet again at 8-30 a.m., tomorrow i.e. Tuesday, the 7th instant)

*Circulated Separately.